# మౌనం వహించని మన సాక్షి

రైలు ఆగీ ఆగటంతోనే అర్చన ఫస్ట్ క్లాస్ కంపార్టుమెంటు వేపు వరిగెత్తి ఆత్రతగా చూడసాగింది.

ఆమె పక్కనే నిలబడ్డ రాధ దృష్టి థర్డ్ క్లాసు పెట్టెలోంచి దిగుతున్న శ్రీకాంత్ మీద ఉంది.

అర్చన వెనక్కి తిరిగి వచ్చింది.

"అరే, నీకోసం అక్కడ వెతుకుతున్నాను శ్రీకాంత్ అమ్మ స్టేషన్‌కు వస్తుందని తెలిసి కూడా ను వ్వింత ధైర్యం చేయటం బాగులేదు."

శ్రీకాంత్ నవ్వాడు.

"రా. అమ్మ అక్కడ మనకోసం ఎదురుచూస్తోంది." అర్చన. శ్రీకాంత్ చెయ్యి పుచ్చుకుని లాక్కెళ్ళింది.

అతను వెనక్కి తిరిగి చూస్తూ- "రాధా... రా..." అన్నాడు.

రాధ అతన్ని అనుసరించింది.

స్టేషన్ బయట కారులో కూర్చుని వచ్చే పోయే జనాన్ని చూస్తోంది సుభద్ర. కట్టుకున్న పట్టుచీర చాలా విలువైనదిలా అనిపిస్తుంది చూడగానే. చాలా మోడరన్ స్టైవులో ఉన్న నల్ల కళ్ళద్దాలలోంచి అటూ ఇటూ చూస్తోంది.

శ్రీకాంత్ అర్చన చేయి పుచ్చుకుని వస్తుంటే ఒక్క క్షణం కనుబొమలు చిట్లించింది. వెంటనే మామూలుగా అయిపోయి - "హలో... శ్రీకాంత్, ఏమి టివాళ విశేషం? రైలు లేటవకుండా మామూలు టైముకి వచ్చేసింది."

"ఒక్కోసారి మన అదృష్టం ఇలా రైళ్ళ రూపంలో బయటపడుతూ ఉంటుంది."

అర్చన నవ్వేసింది.

వెనక సీట్లో అర్చన, రాధ, మధ్య శ్రీకాంత్ కూర్చున్నారు.

"ప్రయాణం హాపీగా జరిగిందా? ను వ్వింకా ఫ్లైట్‌లో వస్తా వనుకున్నాను."

"ఎందుకు డబ్బు దండుగ అనవసరంగా..."

"ఇక్కడ డబ్బు కాదు, టైము ముఖ్యం. ఒక గంట ప్రయాణంతో - అయిపోయేదానికి రెండు రోజుల టైము వృథా చేయటం... ఇలాంటివి నా కిష్టం ఉండదు."

వేలు ఖర్చు పెట్టి విమానంలో వచ్చి ముందుగా అత నిక్కడ చేసేది మాత్రం ఏముందమ్మా - అనుకుంది అర్చన మనసులో.

రాధ మాట్లాడకుండా బయటకి చూస్తోంది. రియర్ వ్యూ మిర్రర్ లోంచి శ్రీకాంత్ అప్పుడప్పుడు తన మొహంలోకి చూస్తున్నాడని ఆమెకు తెలీదు. తెలిసి ఉంటే పలకరింపుగా చిరునవ్వు నవ్వేది. ఆమె బయటకు చూస్తోంది.

సెంటర్‌లోకి రాగానే- "న న్నిక్కడ దింపేయండి. నాన్నగారికి కనిపించి వస్తాను" అన్నాడు శ్రీకాంత్.

"వెడుదువుగానిలే. ఇంటికి వెళ్ళి కాస్త కాఫీ తాగి పది నిమిషాలు కూర్చుని వెళ్ళవచ్చు..." అతనికి మరో మాటకి అవకాశం ఇవ్వకుండా కారు పోనిచ్చింది.

శ్రీకాంత్ మాట్లాడలేదు.

కారు పెద్ద బంగళా ముం దాగింది.

నౌకరు వచ్చి కారు తలుపు తెరిచాడు వినయంగా.

సుభద్ర ఠీవిగా కారులో నుంచి కాలు కింద పెట్టింది.

ఆమె లోపలకి వెడుతుంటే వెనకే కబుర్లు చెప్పుకుంటూ వస్తున్నారు అర్చన. రాధ, శ్రీకాంత్.

వంటమనిషి కాఫీ తెస్తుంటే అర్చన అది అందుకుని తను శ్రీకాంత్ చేతికి ఇచ్చింది.

"రాధా, శ్రీకాంత్ స్నానానికి ఏర్పాట్లు చేయించు. చాలా అలిసిపోయి ఉంటాడు." సుభద్ర రాధకి పురమాయించింది.

శ్రీకాంత్ కంఠం సవరించుకుంటూ అన్నాడు.

"నాన్నగారు ఎదురు చూస్తూంటారు."

"నేను కబురు చేశాను లేవేయ్. భోజనం చేసి కాసేపు పడుకుని వెడుదువుగాని."

అర్చనకి శ్రీకాంత్‌ని చూస్తే జాలేసింది.

అమ్మ మరీ అన్యాయం. పాపం అతని మెతకస్వభావం చూసి మరీ లొంగదియ్యా లనుకుంటూంది. ఒకసారి వెళ్ళి వస్తే ఏం పోయింది? పాపం, ఇన్ని రోజుల తరువాత వచ్చాడు గదా !

సుభద్ర లోపలకి వెళ్ళిపోయింది, తన ఆజ్ఞకి తిరుగులేదన్నట్టు.

రాధ లోపలకి వెళ్ళింది భోజనం ఏర్పాట్లు చెయ్యటానికి.

శ్రీకాంత్ అన్నం సరిగ్గా తినలేకపోయాడు. అది గమనించింది రాధ ఒక్కతే. తల్లి ఆజ్ఞ ప్రకారం అతని కని ప్రత్యేకంగా చేయించిన వంటకాలు ఒకటొకటీ వడ్డించటంలో నిమగ్నురాలై ఉంది అర్చన. లోపల్నుంచి వంటమనిషి అన్నీ అందిస్తున్నాడు.

సుభద్ర తను ఆర్భాటంగా చేయించిన డిన్నర్ ఏర్పాట్లకి అతని ముఖంలో ఫీలింగ్స్ ఎలా ఉంటాయో అని నిశితంగా గమనిస్తోంది.

శ్రీకాంత్ మనసు అక్కడ లేదు.

ఇంట్లో వృద్ధాప్యమూ, ఒంటరితనమూ మాత్రమే తోడుగా ఉన్న తండ్రి గుర్తుకు వస్తుంటే అతనికి ముద్ద మింగుడు పడటంలేదు. సుభద్ర డేగకళ్ళతో తను తినే పద్ధతిని పరీక్షగా గమనిస్తూ ఉంటుందని అతనికి తెలుసు. అందుకే అతి బలవంతంగా ముఖంలోకి చిరునవ్వు తెచ్చుకుంటూ, ఆమె చెప్పే మాటలు వింటూ దాదాపు అరగంటకి భోజనం పూర్తి కానిచ్చాడు.

"రాధా, అతన్ని గదిలోకి తీసుకువెళ్ళు. కొంచెంసేపు విశ్రాంతి తీసుకుంటాడు."

"నాకు పగటి నిద్ర అలవాటు లేదు. వెళ్ళొస్తాను అర్చనా, సాయంత్రం కలుద్దాము..." సుభద్రకి నమస్కారం చేసి వెళ్ళిపోయాడు.

** ** **

బీరువాలో చీరలన్నీ తీసి మంచంమీద కుప్పలా పడేసింది అర్చన. ఏ చీర కట్టుకోవాలో తోచనట్టు ప్రతి ఒక్కటీ తీసి వంటిమీద వేసుకుని చూసుకుంటోంది.

రాధ ఒక చీర తీసింది.

"ఈ రంగు శ్రీకాంత్‌కి చాలా ఇష్టం. ఇది కట్టుకో..."

ఒక్క క్షణం రాధ మొహంలోకి చూసి చేతిలో చీర మంచంమీద పడేసి ఆమె దగ్గరకు వెళ్ళింది.


అతని కా రంగు ఇష్టమని నీ కెలా తెలుసు?"

రాధ చెప్పలేకపోయింది. తన వంటిమీద ఆ రంగు చీర చూసినప్పుడల్లా అతని కళ్ళలో ప్రశంస కనపడుతుందని ఆమె చెప్పలేకపోయింది. అది లేత మబ్బు రంగు చీర.

సాయంత్రం అర్చన, రాధ బయల్దేరుతుంటే పరిశీలనగా చూసింది సుభద్ర. అర్చన ప్రత్యేకంగా అలకంరించుకోవటం గమనించింది.

"అమ్మా మేము సినిమాకి వెళ్ళి అట్నుంచి హొటల్‌లో భోజనం చేసి వస్తాము. శ్రీకాంత్ ఇంటివరకూ దింపుతా నన్నాడు."

"అర్చనా, అసలే నీకు ఆరోగ్యం బాగాలేదు.



చలిగాలిలో తిరక్కపోతే వాళ్ళిద్దర్నీ వెళ్ళనియ్యరాదూ?" ఆమె మాటల్లో అయిష్టత.

"శ్రీకాంత్ ఉండడు గదమ్మా చలి తగ్గాక. సరదాగా వెడదా మనుకున్నాం. నువ్వు భోజనం చేసి పడుకోమ్మా !"

సుభద్ర కూతురివేపు చూసింది.

ఆమె కళ్ళలో ఉత్సాహం, సంతోషం పొంగిపొరలుతున్నాయి. కూతురు ఏది కోరినా కాదనే శక్తి ఆమెకు లేదు. చిన్నప్పట్నుంచీ అలా పెంచింది. అర్చన పుట్టగానే తండ్రిని పోగొట్టుకోవటం అందుకు కారణం కావచ్చు. కూతురు ఏదైనా చెప్పినప్పుడు తను కాదంటే ఆమె మౌనంగా తల దించుకోవటం చూసి ప్రాణం విలవిల్లాడిపోయేది. తండ్రి ఉంటే ఆ పిల్లని ఇంకా ఎంత గారాబంగా చూసేవాడో, తను తక్కువ చేస్తున్నానేమో అనుకుని అర్చన మనసులో ఏం ఉందో ఊహామాత్రంగా తెలిసినా వెంటనే అమర్చిపెట్టేది. అట్లా చిన్నప్పట్నించీ ఏది కోరితే అది లభ్యమవుతూ వచ్చింది అర్చనకి. 'నా కూతురు ఏ విషయంలోనూ నిరుత్సాహపడటం నేను సహించలేను' అనుకుంటుంది సుభద్ర.

రాత్రి పొద్దుపోయాక ముగ్గురూ ఇంటికి వచ్చారు. శ్రీకాంత్ "గుడ్ నైట్' చెప్పి వెళ్ళిపోయాడు.

అతను ఆ ఊళ్ళో ఉన్నన్ని రోజులూ క్షణాల్లా గడిచిపోయాయి వాళ్ళ ముగ్గురికీ.

మర్నాడు శ్రీకాంత్ ప్రయాణం.

విందు ఏర్పాటు చేసింది అర్చన.


"ఇప్పుడు ప్రత్యేకంగా ఎందుకు అర్చనా? అప్పుడప్పుడూ మీ ఇంట్లో భోజనం చేస్తూనే ఉన్నానుగా?"

"అలాకాదు. ఇది ప్రత్యేకంగా నీకు నా ఆహ్వానం. ఎందుకో తరువాత చెప్తాను."

రాధ సాయంతో ఇల్లంతా సర్దింది.

ఫ్లవర్‌వాజ్‌లో తాజా రోజ్‌పూలు పెడుతూ - "రాధా..." అంది.

కిటికీలకి కర్టెన్లు మారుస్తున్న రాధ వెనక్కి తిరిగి చూసింది.



సి హెచ్. శాంతాదేవి

అర్చన రాధ దగ్గరకు వచ్చి నిలబడింది.

కర్టెన్ పక్కకి తీసి చూసింది.

తోటనిండా రకరకాల పూలు రాబోయే వ్యక్తికి స్వాగతం చెప్తున్నట్టు తల లూగిస్తున్నాయి.

రాధ భుజం చుట్టూ చెయ్యేసింది.

"ఈ రోజు నా జీవితంలో ముఖ్యమైన రోజు..."

"... ... ..."

"ఎందుకో చెప్పు." రాధవేపు తిరిగింది.

"శ్రీకాంత్‌కి నీ మనసులో మాట చెప్పి అతనిద్వారా మీ అమ్మగార్ని అడిగించి, ఆ తరువాత..."

"కరెక్ట్. బాగా ఊహించావు రాధా. ఇప్పుడు చెప్పు, అతన్ని గురించి నీ అభిప్రాయం ఏమిటి?"

"అతను చాలా మంచివాడు అర్చనా!" మనస్ఫూర్తిగా అన్నది రాధ.

"ఇక అమ్మని ఒప్పించటం ఒక్కటే మిగిలింది. అదంత సులభంగా సాధ్యపడుతుం దంటావా?"

"ఏమిటి ఆలోచిస్తున్నావు రాధా? అమ్మ ఒప్పుకుంటుందని నా కేమాత్రం నమ్మకంలేదు."

కూతురు కొండమీద కోతిని తెమ్మంటే కొండనే పెళ్ళగించుకురాగల సమర్థురాలు ఆవిడ. కూతురుమీద ఆవిడ కున్న అవ్యాజమైన ప్రేమానురాగాలు రాధకి తెలిసినవే. అర్చనకి

జీవితంలో నిరాశ అంటే ఏమిటో తెలియకుండా పెంచింది. అట్లాంటిది అతి ముఖ్యమైన పెళ్ళి విషయంలో వద్దని ఎలా అంటుంది?

"హలో అర్చనా ! హలో, రాధా !" శ్రీకాంత్ వచ్చేశాడు.

రాధ లోపలకి తప్పుకుంది.

సుభద్ర అర్చనని పిలిచింది.

"అర్చనా, అతని క్కావలసిన సౌకర్యాలు రాధ చేస్తుందిలే. నువ్విలా రా. ఈ లెక్కలు సరిగా కుదరటంలేదు. ఒక వెయ్యి రూపాయలు తేడా వస్తోంది."

"ఇప్పుడే వస్తానమ్మా ! శ్రీకాంత్ మళ్ళీ వెళ్ళిపోతాడు. ఈ ఒక్క రోజేగా అతనితో గడిపేది..."

సుభద్ర మొహం చిట్లించి చూసింది. ఆవిడ అసలు ఉద్దేశం వేరు. రాధని శ్రీకాంత్ కిచ్చి చెయ్యాలని ఆవిడ కోరిక. అందుకే చిన్నప్పట్నించీ వారిద్దరి మధ్యా చనువుని పెంచింది. రాధ దిక్కులేని పిల్ల. తన చిన్నతనంలో తన ఇంట్లో వంటమనిషిగా చేసిన సుబ్బమ్మ చనిపోతూ పసిబిడ్డని తన చేతికి అప్పగించింది.

"దీని భారం మీదేనమ్మా ! మీరు బిడ్డకి అన్యాయం చెయ్యరని నాకు తెలుసు" అని మరీ చచ్చిపోయింది. రాధ ఆ ఇంటికి వచ్చిన మరునటి ఏడాదికల్లా సుభద్ర పసిపాపని ఎత్తుకుంది. అందరూ రాధ వచ్చిన వేళావిశేషం అన్నారు.

సుభద్ర ఏమీ అనుకోలేదు గానీ, అర్చన పుట్టిన దగ్గర్నుంచీ రాధ పరాయిపిల్ల అన్న విషయం పదే పదే జ్ఞాపకాని కొచ్చేది. దాన్ని ఆవిడ బాహాటంగా ప్రదర్శించేది కూడానూ.



చిన్నప్పుడు రాధ రైలుబండి బొమ్మతో ఆడుకుంటుంటే అర్చన తన చేతిలో బొమ్మని గిరాటేసి రాధ చేతిలో బొమ్మ చూపించి కావాలని తల్లి దగ్గర మారం చేసేది. సుభద్ర అతి సునాయాసంగా రాధ చేతిలో బొమ్మ తీసుకుని కూతురు చేతి కిచ్చేది.

మొదట్లో రాధ కర్థమయేది కాదు. తను ఆడుకునే బొమ్మ అర్చన అడగ్గానే ఎందు కివ్వాలో ఆమెకు తెలిసేది గాదు. తరవాత్తరవాత తన కిష్టమైన దేదైనా సరే అర్చన అడిగితే ఇచ్చేయాలనే స్వభావం ఆమెకు తెలియకుండానే ఆమెలో పెరిగింది.

క్లాసులో రాధని టీచర్ మెచ్చుకుందని చెపితే ఆవిడకి కినుకగా ఉండేది. రాధకి అర్చనకన్నా మంచి మార్కులు రావటం చూసి అర్చనకి ట్యూషన్ పెట్టింది. ఫైనల్ ఎగ్జామ్స్‌లో రాధతో పాటు అర్చన కూడా క్లాస్ ఫస్ట్ వచ్చిందని తెలిశాక గానీ ఆవిడ మనసు శాంతించలేదు.

ఈ విధంగా రాధకన్నా తన కూతుర్ని ఒక మెట్టుపైనే ఉంచాలనే తాపత్రయం ఆవిడలో పెరిగిపోయింది.

అర్చనతో పోటీ పడాలని రాధ ఏనాడూ అనుకోలేదు. రాధ కన్నా తను ఎక్కువదాన్ననే ఫీలింగ్ అర్చనలోనూ ఏనాడూ కలగలేదు.

రాధ శ్రీకాంత్‌ని ప్రేమిస్తుందని ఊహామాత్రంగా కూడా తోచని అర్చన - తన భావాలన్నీ నిర్భయంగా రాధతో చెప్పుకునేది. రాధ మౌనంగా వినేది.

చిన్నప్పుడు ఆమె అడగ్గానే రైలు బొమ్మ ఇచ్చేసినట్టు ఈనాడు తను కోరుకునే శ్రీకాంత్‌ని అర్చన 'కావాలి' అనుకోగానే నిస్సంకోచంగా అతన్ని ఆమెకు వదిలి పెట్టింది.

శ్రీకాంత్ వెళ్ళిపోయాడు.

"ఆర్డర్స్ రాగానే లెటర్ రాస్తాను" అన్నాడు.

"లెటర్ రాయడం ఏమిటి ? నువ్వు రావా ? మాకు పార్టీ ఇవ్వవా ఏమిటి ?" అర్చన అంది.

"ఏకంగా ఒకే పార్టీ మేరేజ్‌కి ఇస్తాడులే." రాధ వేపు నవ్వుతూ చూసింది సుభద్ర.

అర్చన సిగ్గుతో తలవంచుకుంది.

వీళ్ళ మూకాభినయం బొత్తిగా అర్థం గాని శ్రీకాంత్ "వెళ్ళొస్తా నని" చెప్పి వెళ్ళిపోయాడు.



అతను వెళ్ళాక అర్చనని దగ్గర కూర్చోబెట్టుకుంది సుభద్ర.

"నీ కీ ఏడాది పెళ్ళి చేయాలనుకుంటున్నాను."

అర్చన మాట్లాడ లేదు.

"నీకు కుదిరితే నీతో పాటు రాధకి కూడా చేసేయ వచ్చును."

"ముందు రాధకి వరుణ్ణి చూడాలిగా !" అర్చన నవ్వింది.

"రాధకి వరుడు కుదిరే ఉన్నాడులే ! నీ సంగతి చెప్పు." తల్లి సూటిగా అడిగేసరికి ఏం చెప్పాలో తోచలేదు ఒక్క క్షణం.

"జడ్జీగారి అబ్బాయి చూసుకుని వెళ్ళాక మనం ఇంతవరకూ ఏ కబురూ చెప్పలేదు. నా కయితే ఆ సంబంధం ఖాయం చెయ్యాలని బాగా ఉంది."

అర్చన గోళ్ళు కొరుక్కుంటూ కూర్చుంది.

"ఏం మాట్లాడవు ? నీ క్కూడా ఇష్టమే అనుకుంటున్నాను. మన హోదాకి తగ్గ సంబంధం."

"అమ్మా, నా పెళ్ళి నా ఇష్ట ప్రకారం చెయ్యా లనుకుంటున్నావా, లేక నీకు నచ్చిన మనిషిని నేను చేసుకోవాలా ?"

"ఏమిటా ప్రశ్న ? నీకు తగిన వా డెవరో నేను నిర్ణయించ గలను ?"

"నాకు తగిన వ్యక్తి ఎవరో నీకు తెలియ దమ్మా ! నా మనసులో శ్రీకాంత్ ఉన్నాడు." తల వంచుకుని చెప్పింది.

సుభద్ర మాట్లాడ లేదు.

అర్చన శ్రీకాంత్‌ని ఎన్నుకున్నదన్న మాట. ఉద్యోగం తప్ప మ రే ఆధారం లేనివాడు, పైగా తన ప్రాపకంతో పైకి వచ్చిన వాడు.

"ఏమంటున్నావు అర్చనా ! అతని స్థితిగతు లేమిటో తెలిసే మాట్లాడుతున్నావా ?"

"మళ్ళీ పాత డైలాగులే నా చేత చెప్పించ కమ్మా ! అతని స్థితిగతుల్ని చూసి కాదు నే నిష్ట పడింది, ప్రేమ ఇద్దర్నీ కూచోబెట్టి కూడు పెట్టదని నాకు తెలుసు. అతనికి ఉద్యోగం వచ్చాకనే చేసుకుంటాను."

మళ్ళీ ఆలోచనలో పడింది సుభద్ర.

రాధ ఒక్క క్షణం కళ్ళ ముందు మెదిలింది. ఆ పిల్ల మనసులో చిన్నప్పట్నుంచీ శ్రీకాంత్ అంటే ప్రేమాభిమానాలు పెరిగేలా చిన్న బీజం నాటి అది పెరగటానికి తన శాయశక్తులా కృషి చేసింది. ఈనాడు అతన్ని కోరుకుంటున్నది అర్చన. చిన్నప్పుడు రైలు బండి లాక్కున్నట్టుగానే ఇప్పుడు రాధ మనసులో ఆ బొమ్మ చెరిపేసి అర్చన మనసులో ప్రతిష్ఠింప చేయటానికి ఆవిడ పూనుకోగలదు. కానీ తన కూతురు వల్ల తన ఈ నిర్ణయం ఎంతవరకూ సమంజసం అన్నదే ఆవిడ ఆలోచన.

అర్చన అక్కణ్ణుంచి లేచి వెళ్ళిపోయింది. తల్లి ఆలోచించుకోవటానికి ఆ మాత్రం వ్యవధి ఇవ్వటం అవసరంగా తోచింది అర్చనకి.

సుభద్ర రెండు రోజులు బాగా ఆలోచించింది. మూడో నాడు అర్చనని పిలిచింది.

"నీ నిర్ణయం అదేనా ? మార్చుకున్నావా ?"

"లే దమ్మా, అతన్ని తప్ప నే నెవర్నీ చేసుకోను."

"సరే, అయితే నీ ఇష్ట ప్రకారమే చేస్తాను. నువ్వు కోరిం దేదీ కాదనే శక్తి నాకు లేదు."

ఈ మాటలు రాధ విన్నది.

అర్చన సంతోషించింది. అమ్మకి ప్రస్తుతం ఇష్టం లేకపోయినా కొన్నాళ్ళ కయినా శ్రీకాంత్ తన కూతురికి తగిన భర్త అని ఆమె తెలుసుకో గలుగుతుంది.

రాధతో సంతోషంగా చెప్పింది. "ఆడపిల్లకి ఇంత కన్నా అదృష్టం ఇంకేమి ఉంటుంది ? తను కోరుకున్న వాణ్ణే భర్తగా పొందటం, ఇది చాలా కొద్ది మందికే సాధ్యమవుతుంది."


రాధ అవు నంది.

సుభద్ర శ్రీకాంత్ తండ్రి దగ్గరకు వెళ్ళి మాట్లాడింది. ఆయన శ్రీకాంత్ ఇష్టపడితే తన కేమీ అభ్యంతరం లేదన్నాడు. శ్రీకాంత్ తప్పకుండా ఒప్పుకుంటాడని సుభద్రకి తెలుసు. తను పెంచి పోషించిన మొక్క ఎటు వంచితే అటు వంగుతుందని ఆమె విశ్వాసం.

శ్రీకాంత్ ఆర్డర్స్ అందుకున్నానని రాశాడు. జాయినింగ్ టైము వారం రోజు లుంది కాబట్టి ఆ వారం రోజులు మీ ఊళ్ళో గడుపుతానని అర్చనకి లెటర్ వ్రాశాడు.

అర్చన పొంగిపోయింది. ఆతను వచ్చే రోజున ప్రత్యేకంగా అలంకరించుకుంది.

"ఈ వారం రోజుల్లోనూ ముహూర్తాలు లేవుట. లేకపోతే ఇప్పుడే పెళ్ళి చేసి ఇద్దర్నీ కలిపి పంపించి ఉండే దాన్ని. అదీ గాక రాధకి



సంబంధం చూడాలి గదా !" అంది సుభద్ర.

అక్కడే ఉన్న రాధ మాట్లాడ లేదు. అర్చన శ్రీకాంత్ గురించి ఏదో చెప్తుంటే మౌనంగా వింటోంది.

శ్రీకాంత్ వచ్చాడు. ఎప్పటి లాగానే రాధతోనూ, అర్చనతోనూ జోకులు, నవ్వులు.

"రాధా ! ను వ్విలా రా. వాళ్ళిద్దరూ మాట్లాడుకుంటూ ఉంటారులే. వడ్డనలో కాస్తం సాయం చెయ్యి." సుభద్ర పిలిచింది.

భోజనాల దగ్గర రాధకీ, అర్చనకీ మధ్యలో శ్రీకాంత్ కూర్చోబోతుంటే సుభద్ర వచ్చింది.

"రాధ తర్వాత తింటుందిలే. నా క్కొంచెం పనిలో సాయం చెయ్యాలి. మీ రిద్దరూ తినండి."

అర్చన అ దేమీ పట్టించు కోలేదు. నవ్వుతూ, తుళ్ళుతూ కబుర్లు చెపుతోంది శ్రీకాంత్‌తో.

సాయంత్రం అర్చన టిప్‌టాప్‌గా ముస్తాబై వంటింట్లో ఉన్న రాధ దగ్గరకు వచ్చింది.

"ఏమిఁ టింకా అలాగే ఉన్నావు ? శ్రీకాంత్ సినిమాకి రమ్మన్నాడు. మరిచిపోయావా ?"

రాధ త లెత్తి అర్చన మొహంలోకి చూసింది.

"త్వరగా తయారుకా. మళ్ళీ టైమైపోతుంది. అతను టిక్కెట్లు కొని థియేటర్ దగ్గర ఉంటా నని చెప్పాడుగా."

"అర్చనా ! నువ్వు వెళ్ళు. రాధ రాదు. నన్ను గుడికి తీసుకు వెళ్ళాలని చెప్పాను."

"ఇవాళ శుక్రవారం కాదు గ దమ్మా !" అసహనంగా అంది అర్చన.

"ఇవాళ శనివారం అని మరిచిపోయావా ? నేను వెళ్ళేది వెంకటేశ్వరస్వామి ఆలయానికి."

అప్పుడు గుర్తు వచ్చింది అర్చనకి. అమ్మ ప్రతి శనివారం వెంకటేశ్వరుని గుడికి వెళ్ళటం అలవాటు. కానీ ప్రతిసారీ రాధను వెంటబెట్టుకు వెడుతుందా అన్న అనుమానం లీలగా తోచింది. చిరాగ్గా చూసింది.

"సరే, మేము వెడతాములే. రాధా మేం వచ్చేసరికి భోజనం చేశావో చూడు మరి..." అర్చన వెళ్ళిపోయింది.

రాధ నిర్లిప్తంగా చూసింది ఆమె వెళ్ళిన వేపు.

థియేటర్ దగ్గర వచార్లు చేస్తున్న శ్రీకాంత్ అర్చన ఒంటరిగా రావటం చూసి వెంటనే ప్రశ్నించాడు.

"రాధ రాలేదే ?"

"అమ్మని గుడికి తీసికెళ్ళాలిట. తన టిక్కెట్టు ఎవరికైనా ఇచ్చెయ్యి."

శ్రీకాంత్ మొహంలోకి చూసి ఉంటే అతని కళ్ళల్లో ఆశాభంగం ఇట్టే పసిగట్టేది అర్చన.

ఇద్దరూ లోపలకు వెళ్ళి కూర్చున్నారు.

సినిమా నుంచి ఇంటికి వచ్చేసరికి సుభద్ర వడ్డిస్తూంది.


"రాధ 'తినేసిందా ?" అర్చన అడిగింది.

"ఆఁ.... పడుకుంది. శ్రీకాంత్ రేపు మీ నాన్నగార్ని తీసుకుని ఒకసారి మా ఇంటికి రావాలి."

"తప్పకుండా. అసలు నాన్నగారే రావా లనుకుంటున్నారు. నాకు ఉద్యోగం రావటం మీ చలవే ననీ, మీకు కృతజ్ఞతలు స్వయంగా చెప్పుకోవాలనీ ఆయన తహతహలాడుతున్నారు."

సుభద్ర మొహంలో రంగులు మారాయి.

మరొకప్పు డైతే అతని పొగడ్తలకి తబ్బిబ్బు అయ్యేదే. కానీ ఇప్పుడు అతను తనకు కాబోయే అల్లుడు. అల్లుడు హోదాలోనే ఉండాలి గానీ, తన వట్ల విశ్వాసం ప్రకటించే స్థితిలో ఉండ కూడదు.




మర్నాడు శ్రీకాంత్ ఒక్కడే వచ్చాడు.

"నాన్నగారికి జ్వరంగా ఉంది. ఆయన రాలేకపోయి నందుకు క్షమాపణ చెప్ప మన్నారు." వినయంగా అన్నాడు.

సుభద్ర విసుగ్గా చూసింది. మళ్ళీ అదే మాట ! తను కింద మెట్టు మీద ఉన్నాననే విషయం పదే పదే గుర్తు చేయటం నచ్చలేదు ఆవిడకి.

"పర్వాలేదులే. అఁ.. శ్రీకాంత్, నీకు ఉద్యోగం వచ్చింది. ఇక పెళ్ళి సంగతి ఆలోచిస్తే బావుంటుంది." చిరు నవ్వుతో అంది.

శ్రీకాంత్ ఇబ్బందిగా నవ్వాడు.

"నే నింకా ఏమీ అనుకోవటం లే దండీ."

"ను వ్వనుకునే దేమిటి ? అన్నీ నేను నిర్ణయించేశానులే. నీకు ఎప్పుడు సెలవు దొరుకుతుం దంటే అప్పుడు ముహూర్తాలు పెట్టిస్తాను."

శ్రీకాంత్ త లెత్తి ఆవిడ మొహంలోకి చూశాడు.

"మీ నాన్నగారితో మాట్లాడాను. ఆయన ఒప్పుకున్నారు. నీకూ అంగీకారమే నని నాకు తెలుసు. ఎట్లా తెలుసు నంటావా ? ఇట్లాంటి విషయాలు నోరు తెరిచి చెప్ప నవసరం లేకుండానే తెలుస్తాయి."

శ్రీకాంత్ ఆశ్చర్యంగా చూశాడు.

తను రాధతో ఏమీ అనుచితంగా ప్రవర్తించలేదే ఈవిడ ఎట్లా అనుమానించింది.

"రాధని అడిగారా మరి ?" తల వంచుకుని అన్నాడు.

ఈసారి ఆశ్చర్యపోవటం ఆవిడ వంతయింది.

"రాధనా, రాధ నడగటం ఏమిటి ?"

పక్క గదిల్లో ఉన్న అర్చన శ్రద్ధగా వింటోంది వీరి సంభాషణ.

"అర్చనని నీ కిచ్చి చెయ్యా లనుకుంటున్నాను. అర్చన ఒప్పుకున్న తర్వాతనే నీ దగ్గర ఈ ప్రస్తావన తీసుకొచ్చాను."

శ్రీకాంత్ క్రుంగిపోయాడు. ఆతనికి అక్కడ ఒక్క క్షణం కూర్చోబుద్ధి కాలేదు.

"ఆలోచించుకుని చెపుతాను లెండి." తల వంచుకుని వెళ్ళిపోయాడు. గేటు దాటుతూ వెనక్కి తిరిగి చూశాడు.

అతను ఆశించినట్టుగా రాధ కనపడలేదు గానీ, కిటికీ చువ్వలు పట్టుకుని బయటకు చూస్తూ అర్చన నిలబడి ఉంది.

అతను గేటు దాటి చరచరా వెళ్ళిపోయాడు.

*** *** ***

"సుభద్రమ్మ గారికి,

నన్ను క్షమించ మని అడగను. ఎందు కంటే ఈనాడు నేను మనస్సు మార్చుకున్న దేమీ లేదు. మొదటి నుంచీ మీ కోరికకి అనుగుణం గానే నడుచుకుంటూ వచ్చాను. మొదటి నుంచీ మీ మనసులో ఉద్దేశం మీకే తెలియకుండా బయట పెట్టుకున్నారు. రాధని నా కిచ్చి చెయ్యాలనే కోరిక మీకే తెలియకుండా మీ ప్రవర్తనలో బయట పడేది. నేను ఆరాధించింది రాధని గానీ, అర్చనని కాదు. ఇవ్వాళ అర్చన నన్ను కోరుకోగానే రాధ దగ్గర్నుంచి నన్ను లాక్కుని మీ కుమార్తెకు అందివ్వగలరు. అది మీకు సాధ్యమయే పనే. కానీ ప్రాణం లేని రైలు బొమ్మని లాక్కున్నట్టు ఒక మన సున్న మనిషిని లాక్కోవటం మీకు చేత కాదు. ఈ ప్రాణం ఉన్న బొమ్మ రాధకే చెందుతుంది. అర్చనని మాత్రం క్షమాపణ కోరుకున్నానని చెప్పండి....

ఇట్లు,

శ్రీకాంత్.

